# టెక్సాస్‌లో హిందీ డే

## అమెరికన్ విద్యార్థుల నుంచి విశేష స్పందన



డాలస్, టెక్సాస్ – హిందీ దినోత్సవం సందర్భంగా భారత కౌన్సులర్ జనరల్ సంజీవ్ అరోరా గురువారంనాడిక్కడ యూలెస్‌లోని సెంట్రల్ జూనియర్ హైస్కూల్‌ని సందర్శించి అందులో హిందీ నేర్చుకుంటున్న అమెరికన్ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఈ సందర్భంగా కౌన్సులర్ జనరల్ సంజీవ్ అరోరా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న గ్లోబల్ కాంపిటీషన్‌లో హిందీ భాషను నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. జూనియర్ హైస్కూల్ స్టూడెంట్స్‌కు హిందీ బోధన ప్రారంభించినందుకు హెచ్‌ఇబి ఐఎస్‌డి సూపరింటెండెంట్ డాక్టర్ బాయింగర్‌ను కౌన్సులర్ జనరల్ అభినందించారు. హిందీ ప్రోగ్రామ్ విజయవంతం కావడానికి తమ వంతు ప్రోత్సాహం తప్పనిసరిగా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇండో అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ (ఐఎఎఫ్‌సి) టెక్సాస్ స్టేట్ కోఆర్డినేటర్ ప్రసాద్ తోటకూర కూడా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ "ప్రపంచంలోనే ఎక్కువ జనాభా మాట్లాడే రెండో భాష హిందీ. ఇందులో చదవడమే కాకుండా రాయడం, మాట్లాడటం చాలా అవసరం. ఇప్పుడు ప్రపంచంలో ప్రతి 100 మందిలో 35 మంది చైనీస్ లేదా ఇండియన్ సంతతి వారే" అన్నారు.

ఇంటర్నేషనల్ బిజినెస్ ఇనిషియేటివ్ (ఐబిఐ) భవాని పార్థియా మాట్లాడుతూ "యూలెస్ సిటీలో సెంట్రల్ జూనియర్ హైస్కూల్‌లో 7, 8 గ్రేడ్ స్టూడెంట్స్‌కు యుసిక్ ప్రోగ్రామ్‌ని అందిస్తోంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా రెండు దేశాల సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, ఇంటర్నేషనల్ డిప్లమసీకి దోహదపడటం, జాతీయ భద్రతను ప్రమోట్ చేయడం సాధ్యమవుతుంది. ఏషియన్ లాంగ్వేజెస్ తెలుసుకోవడం వల్ల అంతర్జాతీయ యూనివర్సిటీలలో ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి" అని చెప్పారు.



హెచ్‌ఇబి ఐఎస్‌డి సూపరింటెండెంట్ డాక్టర్ జీన్ బాయింగర్ మాట్లాడుతూ హిందీ డే ఈవెంట్‌ని విజయవంతం చేసినందుకు కౌన్సులర్ జనరల్ సంజీవ్ అరోరా, ప్రసాద్ తోటకూరలకు కృతజ్ఞతలు తెలియజేశారు. గత రెండేళ్లుగా హిందీ లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. హిందీ పాఠాలు బోధిస్తున్న సిబ్బందిని కూడా ఆయన అభినందించారు. డాక్టర్ బాయింగర్, భవాని పార్థియా, ప్రసాద్ తోటకూర ఈ సందర్భంగా అమెరికాకు ఇండియన్ అంబాసిడర్ మీరా శంకర్‌ను కలిసి సెంట్రల్ హైస్కూల్‌లో హిందీ బోధనల ప్రోగ్రెస్ గురించి వివరించారు. అంబాసిడర్ శంకర్ డాక్టర్ బాయింగర్‌ని అభినందించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

హిందీ డే కార్యక్రమంలో సెంట్రల్ జూనియర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ జోనాథన్ జెన్స్, హిందీ టీచర్ ప్రభల శ్రీరంగం తదితరులు కూడా పాల్గొన్నారు.